# బీఆర్ఎస్‌లో నయా జోష్

- కేసీఆర్, కేటీఆర్ సభల సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- పెరిగిన వలసలు
- ఎన్నికల ప్రచారంలో ముందంజ
- హ్యాట్రిక్ గెలుపు దిశగా జీవన్‌రెడ్డి
- బెంబేలెత్తుతున్న ప్రత్యర్థులు



ఈనెల 3న ఆర్మూర్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

నందిపేట్/ఆర్మూర్, నవంబర్ 11: నియోజకవర్గాన్ని అగ్ర భాగాన నిలిపిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రత్యర్థులను చిత్తు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎత్తుగడలు, కేసీఆర్, కేటీఆర్ సభల సక్సెస్, కాంగ్రెస్, బీజేపీలలో నైరాశ్యం వెరసి బీఆర్ఎస్‌లో సరికొత్త జోష్ కనిపిస్తోంది. ఈనెల 3న ఆర్మూర్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు, 9న బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా పాల్గొన్న మంత్రి కేటీఆర్ ర్యాలీకి నియోజకవర్గం నలుమూలాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం కలిగించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు విపరీతంగా పెరిగాయి. వివిధ ప్రజా, కుల సంఘాలు కూడా జీవన్‌రెడ్డికి ఏకపక్షంగా మద్దతు ప్రకటిస్తూ తీర్మానాలు చేస్తున్నాయి. ఈ పరిణామాలతో ప్రధాన ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు బెంబేలెత్తుతున్నాయి. ఆర్మూర్‌లో హల్‌చల్ చేస్తున్న కారు జోరును అడ్డుకునే మార్గం కనిపించక ప్రత్యర్థులు డీలా పడిపోయారు. ఇదిలా ఉండగా జీవన్‌రెడ్డి వినూత్న రీతిలో ప్రజలకు మరింత చేరవయ్యే ఎత్తుగడలతో ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ప్రతిరోజూ మూడు గ్రామాల్లో ప్రజాశీర్వాద సభలు నిర్వహించడంతోపాటు గడపగడపకూ తిరుగుతూ తనను మళ్లీ దీవించాలని కోరుతున్నారు. ప్రతి గ్రామంలో ప్రజా ఆశీర్వాద సభల ద్వారా ప్రతి గ్రామంలో పదేండ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రగతి నివేదికలు ప్రజల ముందు పెడుతున్నారు. తమ గ్రామాలు గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందాయని, ఈ అభివృద్ధి పథకాలు తెచ్చింది జీవనన్న, ఇచ్చింది కేసీఆర్ అంటూ గ్రామాల్లో ప్రజలు నినాదాలు చేస్తుండడం బీఆర్ఎస్ శ్రేణులను మరింత ఉత్తేజపరుస్తోంది. హ్యాట్రిక్ విజయం దిశగా దూసుకపోతున్న జీవన్‌రెడ్డికి నియోజకవర్గం పెద్ద ఎత్తున క్రేజ్ రావడానికి వెనుక పదేండ్లుగా ఆయన పడుతున్న శ్రమ ఉంది. తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రోజు నుంచి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించారు. ఆర్మూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చడం కొత్తగా డొంకేశ్వర్, ఆలూర్ మండలాలుగా ఏర్పాటు చేయించడం వంటివి ప్రజల్లో జీవన్‌రెడ్డి ఇమేజ్ పెరగడానికి దోహదపడ్డాయి. ఈ నేపథ్యంలో మంచి ఊపు మీదున్న బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి దూకుడును ఎలా అడ్డుకోవాలో వశపడక ప్రత్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

## బీఆర్ఎస్‌లో యువకుల చేరిక



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, నవంబర్11: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆర్మూర్ పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మీ యూత్ సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే, ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్‌కు ఓటు వేసేలా చూడాలని యూత్ సభ్యులకు జీవన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాట్‌పల్లి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజానరేందర్, సుంకరి రవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## జోరుగా బీఆర్ఎస్ ప్రచారం



మాక్లూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి సతీమణి ఆశన్నగారి రజితారెడ్డి

మాక్లూర్, నవంబర్ 11: మండల కేంద్రంలో శనివారం ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్లను కలిసి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన జీవన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను మరిచిపోవద్దన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ బాశెట్టి సుమలత, ఉప సర్పంచ్ దర్గాల అనిత, మాసం లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



అంగడి బజార్‌లో పూల దుకాణాల వద్ద కొనుగోలు దారుల సందడి

## పట్టణానికి దీపావళి శోభ

ఆర్మూర్‌టౌన్, నవంబరు11: దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో నూతన శోభ సంతరించుకుంది. పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, భవంతులు విద్యుత్‌దీపాల కాంతులతో వెలుగులీనుతున్నాయి. సిద్దుల గుట్ట వెనుకాల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో పటాకుల దుకాణాలను ఏర్పాటు చేశారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు స్టాళ్ల వద్దకు వచ్చి పటాకులు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు దారులతో పట్టణంలోని పూల దుకాణాలు, స్వీట్ల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

## జంబి హనుమాన్ ఆలయంలో పూజలు

ఆర్మూర్ టౌన్, నవంబర్11: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. నాగం బాబన్న, లక్ష్మి, దార్ల సంతోష్, పద్మ తదితరుల సహాయంతో అన్నదానం నిర్వహించారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

**PUBLIC NOTICE**

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist.Nizamabad** agreed to accord Loan to **Shaik Ibrahim** S/o.Shaik Saleem, Aged 37 Yrs, Occ:Business, R/o.H.No.6-10, Khudavanpur (V), Nandipet Mandal, Nizamabad (Dist) (Borrower/Property holder) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

**SCHEDULE OF THE PROPERTY**

All that the Open Plot No.43 of Nandipet Village Shivar in all measuring 155.55 Sq.Yds or 130.05 Sq.mtrs being part of the land comprised in Survey Nos.691/4 & 691/5 situated at Nandipet Village, Nandipet Mandal Nizamabad District, within the limits of Gram Panchayat Nandipet, Regn.Sub Dist. Armoor and Regn.Dist Nizamabad (Subject matter of the Regd.Sale Deed Document No. 3259/2015, Dt.08.06.2015 SRO Armoor) **Bounded by: North:** Plot No.28, **South:** 20'-0" wide road, **East:** Plot No.44, **West:** Plot No.42

**Sd/- R.JAGADISHWER RAO**, Advocate
Subhashnagar, Nizamabad.Cell:98480 94409.

## గొర్రెల పెంపకందారులకు దాణా పంపిణీ

నందిపేట్, నవంబర్ 11: డొంకేశ్వర్ మండలంలోని నికాల్ గ్రామంలో 2వ విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 17 మంది లబ్ధిదారులకు దాణా, మందులు ఉచితగా పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి హన్మంత్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకురాలు సరళారాణి, సిబ్బంది రాజేందర్, సత్యం, ఉప సర్పంచ్, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.



దాణాను పంపిణీ చేస్తున్న పశు వైద్యాధికారి హన్మంత్‌రెడ్డి

## అనాథ ఆశ్రమంలో దీపావళి వేడుకలు



విద్యార్థులకు పటాకులు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, నవంబర్11: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వీ తేజో నిలయం (అనాథ ఆశ్రమం)లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ విద్యార్థులకు మిఠాయిలు, పటాకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తేజో నిలయం విద్యార్థులకు సేవలందించేందుకు క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. విద్యార్థులకు పటాకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పట్వారి తులసీకుమార్, కోశాధికారి లక్ష్మీ నారాయణ, సభ్యుడు పుష్పాకర్ రావు పాల్గొన్నారు.